
సాక్షి
ఒడిశా

గురువారం । 26 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,79,850లు, బంగారం 9.5 గ్రాములు, వెండి 47.4 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



బీఆర్ఎస్ గూటికి కొరాపుట్ నేతలు!

- 8లో



ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- 8లో

న్యూస్‌రీల్

కొరాపుట్ చేరుకున్న మంత్రులు



మంత్రులు తుషార్‌కాంతి బెహరా, టుకుని సాహులకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కొరాపుట్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రమంత్రులు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. రాష్ట్ర హోంమంత్రి తుషార్‌కాంతి బెహరా, నీటిపారుదల శాఖామంత్రి టుకుని సాహు భువనేశ్వర్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కొరాపుట్ లోని బీఎస్ఎఫ్ ఎయిర్‌స్ట్రిప్ వద్ద దిగారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సర్క్యూట్ హౌస్‌కు తరలివెళ్లారు. టుకుని సాహు అక్కడిఇ నుంచి మల్కన్‌గిరి జిల్లాకు చేరుకున్నారు. మంత్రులకు ఏడీఎం రాజేంద్ర మాఝి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, కొరాపుట్ పురపాలక సంఘం అధ్యక్షుడు లలాటేందు రంజన్‌శెఠి, బీజేడీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

ఖండవలో బీజేపీ కమిటీ సమావేశం



సమావేశంలో బీజేపీ నాయకులు సరోజ్ సాబత్, ప్రశాంతకుమార్, గంతాయత్

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ ఖండవ జోన్-1లో బీజేపీ బూత్ లెవల్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. పార్టీ జిల్లా పర్యవేక్షకులు, ప్రభారీ సరోజ్ సాబత్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో వివిధ బూత్ స్థాయిలో అనుసరించాల్సిన ప్రణాళికను వివరించారు. సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఉమా గంతాయత్, కృషక్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ పాలో, భువనీ నాయక్, ఖండవ, శియ్యాలీ కార్యకర్తలు పాలక్గొన్నారు.

50 కిలోల గంజాయి సీజ్

- ఇద్దరు నిందితులు అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

బరంపురం: జిల్లాలోని అస్కా నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులనె అరెస్ట్ చేశారు. ఐఐసీ అధికారి హరిచందన్ సామంతరాయ్ తెలిపిన వివరాల ప్రకారం గంజా జిల్లా అస్కా పట్టణం నుంచి బరంపురం వైపు వస్తున్న కారులో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు దిగపండి, బరంపురం మధ్య మూడు రోడ్ల జంక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. ఫస్ట్‌గేట్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద వాహనాన్ని అడ్డుకొని, సోదా చేయగా 2 బస్తాల్లో 50కిలోల గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఇరువురూ గంజాం జిల్లా పత్రపూర్ బ్లాక్ సింగిపూర్ గ్రామానికి చెందిన నిరంజన్ ప్రధాన్, శాసన్‌పూర్ గ్రామానికి చెందిన అభిషేక్ కుమార్ తివారీగా గుర్తించారు.

'వేడుకలు బహిష్కరించండి'



కూబింగ్ నిర్వహిస్తున్న జవాన్లు

మల్కన్‌గిరి: ఏఓబీలో భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు బహిష్కరించాలని ఆంధ్ర-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరిట మవోయిస్టులు బుధవారం లేఖను విడుదల చేశారు. నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటంలో గిరిజనులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గణతంత్ర వేడుకలు పాలక దోపిడీ వర్గాలకు మాత్రమే సంబంధించినదని ఆరోపించారు. దీనిపై మల్కన్‌గిరి పోలీస్ ఎస్పీ నితీష్ వాధ్వనీ స్పందించారు. మన హక్కులను వదులు కోవద్దని, ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు సరిహద్దు ప్రాంతాలైన చిత్రకొండ, పాడియా ప్రాంతాల్లో బీఎస్ఎఫ్, జిల్లా పోలీసులు సంయుక్తంగా కూబింగ్ నిర్వహిస్తున్నారని వివరించారు.




పద్మాలంకరణలో పూర్తయిన ప్రధాన భాగం



పద్మాలంకరణలో దేవతాత్రయం బలభద్ర, సుభద్ర, జగన్నాథుడు

అపురూపం పద్మాలంకారం

- నేడు పూరీ జగన్నాథునికి పద్మాలంకరణ సేవ
- అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన ఏకాంత పూజలు
- 12వ శతాబ్దం నుంచి కొనసాగుతున్న సంప్రదాయం
- దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికార వర్గాలు



తుది మెరుగులు దిద్దుకుంటున్న అలంకరణ సామగ్రి

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై స్వామి పద్మ అలంకారంతో శోభిల్లుతాడు. ఈ అలంకరణ వికసించిన కమలంలో స్వామి కొలువైనట్లు ఉంటుంది. భక్తులు, యాత్రికులకు అరుదైన ఈ అలంకార దర్శనం గురువారం లభించనుంది. ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఈ అలంకరణ జరగడం అత్యంత అపురూపం. జగన్నాథుని అలంకారాల్లో పద్మాలంకారం విభిన్నత రంగరించుకుంది. నిత్యం ఏకాంత సేవ పురస్కరించుకుని జగన్నాథుడు బొడొ సింగార్ అలంకరణలో పవళిస్తాడు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఏడాదికి ఒక్కరాత్రి మాత్రమే ఈ ఏకాంత సేవ జరుగనుంది. సుప్రభాతం తర్వాత ఈ అలంకరణ తొలగిస్తారు. ముందు రోజు రాత్రి అలంకరణ జరిగిన మర్నాటి ప్రాతః కాలంలోనే భక్తులకు ఈ అలంకరణలో దర్శనం ప్రాప్తిస్తుంది. అత్యంత స్వల్పంగా గురువారం ఉదయం కొన్ని గంటలు మాత్రమే దర్శన భాగ్యం లభించనుంది.

తిథి, వారం ప్రాముఖ్యత..

ఏటా మాఘమాసం అమావాస్య తిథి, వసంత పంచమి మధ్య శనివారం లేదా బుధవారం ఈ అలంకరణ జరుగుతుంది. ఈ లెక్కన ఈ ఏడాది బుధవారం అలంకరణ చేపట్టారు. నిత్యం జరిగే ఏకాంత సేవకు ముందుగా దేవతా త్రయం పద్మాలంకరణ పూర్తి చేస్తారు. అలంకరణ అనంతర సేవాదులు ముగించడంతో స్వామి పద్మ శోభితంగా పవళిస్తాడు. ఈ నేపథ్యంలో అలంకరణ తొలి రోజున భక్తులు, యాత్రికులకు అలంకార దర్శనం లభించదు. మర్నాడు ఉదయం(గురువారం) ప్రాతః కాల మంగళ హారతి తరువాత నుంచి రత్న వేదికపై కొలువుదీరిన మూల విరాట్లు భక్తులకు పద్మ శోభిత దర్శనం కల్పించడం విశేషం. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి యాత్రికులు తండోప తండాలుగా తరలి రానున్నట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. రద్దీ నియంత్రణకు ఆలయం లోపల, వెలుపల గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.

బొడొ ఛొత్తా మఠం పాత్రధారి

ఏటా స్వామివారికి జరిగే ప్రత్యేక పద్మాలంకార ప్రక్రియలో బొడొ ఛొత్తా మఠం ప్రధాన పాత్రధారి. ఈ మేరకు జగన్నాథునితో ఆయన అన్నా చెల్లెళ్ల అలంకరణకు అవసరమైన సకల సరంజామా ఈ మఠం ఏర్పాటు చేస్తుంది. శ్రీమందిర్ సేవకుడు వసంత్ రాణా ఆధ్వర్యంలో సత్యనారాయణ బెహరా, సత్య కుమార్ మిశ్రా, రఘునాథ్ బెహరా, బాసుదేవ్ మహాపాత్రొ బృందం అలంకరణ సామగ్రి సిద్ధం చేసింది. బుధవారం సూర్యాస్తమయం తర్వాత ఈ సామగ్రిని శ్రీమందిరం ప్రధాన అంతరాలయం లోపలికి తరలించారు. రాత్రి జరిగే ఏకాంత సేవలో ఈ సరంజామాతో స్వామిని అలంకరిస్తారు. అత్యంత నియమ నిష్ఠలతో సేవకులు ఈ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారు. ఒంటిపూట ఆరగింపుతో అలంకరణ సామగ్రి తయారీలో అంకితభావంతో పాల్గొంటారు. ఈ ప్రక్రియలో పలు రంగుల వస్త్రాలు, జీలుగు, జరీ, వెదురు, బెత్తం ఉపయోగించి తయారు చేస్తారు. దీనిని రత్న వేదికపై తామర పువ్వుల అలంకరణతో సర్దుబాటు చేస్తారు.

కలలో కనిపించి..

జగన్నాథుడు భక్త సులభుడు. భక్తుల కోరిక మేరకు ఏటా ఆయన పలు అలంకారాల్లో దర్శనం ఇస్తాడు. ఈ కోవకు చెందినదే పద్మ అలంకరణ. సంత్(సాధువు) మనోహర్ దాస్ పరమ భక్తి భావం పట్ల పరవసించిన స్వామి గజపతి మహారాజాకు కలలో కనిపించి, ఆదేశించడంతో ఈ ఆచారం వ్యవహారంగా మారిందని కథనం. 12వ శతాబ్దంలో సంత్ మనోహర్ దాస్ పుష్కరిణిలో వికసించిన పద్మ పూలను సేకరించి తాను వినియోగించే గావంచా(తుండు)లో మూటగట్టి, స్వామి సేవకు అభ్యర్థించాడు. అయితే పూలన్నీ వాడిపోవడంతో స్వామి సేవకులు సంత్ అభ్యర్థనను నిరాకరించారు. ఆ రాత్రి గజపతి రాజుకు జగన్నాథుడు కలలో కనిపంచి, పద్మాలంకారంలో ప్రత్యక్షమై ఆదేశించడంతో సంత్ భక్తి తత్పరతకు ప్రతీకగా ఏటా రత్న వేదికపై మూల విరాట్‌లకు బొడొఛొత్తా మఠం ప్రత్యక్ష పర్యవేక్షణలో పద్మాలంకరణ సేవ నిర్వహిస్తున్నారు.

చేతబడి నెపంతో వ్యక్తి హత్య



సగం కాలి ఉన్న గంగా పాడియామి మృతదేహం



ఘటనా స్థలంలో గుమిగూడిన గ్రామస్తులు

మల్కన్‌గిరి: చేతబడి చేస్తున్నాడనే నెపంతో ఓ వ్యక్తిని దారుణంగా కొట్టి చంపిన ఘటన జిల్లాలోని కలిమెల సమితి మోటు పోలీసు స్టేషన్ పరిధిలో చేటు చేసుకుంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తీన్‌రాజ్‌పల్లి గ్రామానికి చెందిన గంగా పాడియామి(40), స్థానికుల మధ్య గత కొద్ది రోజులుగా వివాదం నడుస్తోంది. కొంతమంది వ్యక్తులపై చేతబడికి పాల్పడుతున్నాడనే ఆరోపణతో గ్రామస్తులు అతనిని ఇది వరకే హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మద కామిని ఇంటి నుంచి సమీపంలోని అడవిలోకి ఈడ్చుకొని వెళ్లారు. అక్కడే హతమార్చి కిరోసిన్ పోసి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న మోటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముందే వచ్చిన పండుగ



జెండా ఎగరివేస్తున్న చిత్రకొండ ఎస్‌డీపీఓ కిష్పోటా

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబ్, ఆంద్రహల్, సింధిబాడి గ్రామాల్లో తొలిసారిగా గణతంత్ర దినోత్సవం జరుపుకొన్నారు. దేశవ్యాప్తంగా గురువారం గణతంత్ర దినోత్సవం నిర్వహించనుండగా, ఆయా గ్రామాల్లో ఒకరోజు ముందుగానే జెండా వందనం జరిపారు. గతంలో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో జవాన్ల ప్రవేశంతో పరిస్థితులు పూర్తిగా మారాయి. ఈ నేపథ్యంలో జోడాంబ్ పాఠశాల వద్ద విద్యార్థులు, గ్రామస్తులు తొలిసారిగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిత్రకొండ ఎస్‌డీపీఓ అర్లెక్సియస్ కిష్పోటా, జోడాంబో బీఎస్ఎఫ్ క్యాంపు కమాండర్ ఆశిష్‌కుమార్, పోలీసు ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ్ ముధిలి, సర్పంచ్ పింకి హంతాల్, తదితరులు హాజరయ్యారు.



ఆనందంతో జెండాలు చేతపట్టిన చిన్నారులు, గిరిజనులు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



బోల్తాపడిన ట్రాక్టర్



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన రమేష్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

రాయగడ: జిల్లాలోని రెండు వేర్వేరు రోడ్డు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. కాసీపూర్ సమితి తొలామండిజోల గ్రామం సమీపంలో మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో గొడోవీధికి చెందిన వైకుంఠ గోపాల్(44) మరణించారు. మెటల్ లోడ్ తీసుకు వెళ్లుండగా ట్రాక్టర్ అదుపు తప్పి, లోయలో పడిపోవడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. అలాగే జిల్లాలోని బిసంకటక్ పోలీస్ స్టేషన్ పరిధి గొడగుడ మలుపు వద్ద లారీ బోల్తా పడి, సుమారు 50 అడుగుల లోయలోకి దూసుకు పోయింది. ఈ దుర్ఘటనలో బిసంకటక్‌కు చెందిన యువకుడు కె.రమేష్(35) మృతి చెందాడు. మునిగుడ నుంచి వస్తున్న లారీ అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని బయటకు తీశారు. అయితే లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన రమేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. 2 ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



విజ్ఞాన ప్రదాయిని సరస్వతీ దేవి సకల మానవాళికి విద్యాబుద్ధులు ప్రసాదించాలనే ఆకాంక్షతో అంతర్జాతీయ సైకతశిల్పి మానసకుమార్ సాహు భారీ సైకత శిల్పం ఆవిష్కరించాడు. పూరీ సాగర తీరంలో 10 టన్నుల ఇసుకతో 20 అడుగుల ఈ శిల్పాన్ని రూపొందించేందుకు 7 గంటలపాటు నిరవధికంగా శ్రమించినట్లు సాహు తెలిపారు. - భువనేశ్వర్

రాత్రి వేళా.. రాకపోకలు

- జయపురం నుంచి రాత్రి సమయాల్లోనూ విమానాలు నడిచేందుకు అనుమతి



జయపురం విమానాశ్రయం

జయపురం: స్థానిక విమానాశ్రయం నుంచి రాత్రి వేళల్లో కూడా విమానాలు రాకపోకలు సాగించేందుకు పౌర విమానయాన సంస్థ అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు జయపురం విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించారు. 2022 అక్టోబర్ 31న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విమానాశ్రయాన్ని ప్రజలకు అంకితం చేసి, జయపురం-భువనేశ్వర్ మధ్య 9సీట్ల సామర్థ్యంతో నడిచే విమాన సర్వీసులను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇండియా ఒన్ ఎయిర్ విమానసంస్థ సర్వీసులు నిర్వహిస్తోండగా, కొద్ది రోజుల క్రితం జయపురం-విశాఖపట్నం మధ్య విమానాలు ప్రారంభమయ్యాయి. తాజాగా భువనేశ్వర్-జయపురం-విశాఖపట్నం మధ్య మరో విమానం నడిపేందుకు ముందుకు రాగా.. రాత్రి వేళల్లో సైతం సర్వీసులు నిర్వహించేందుకు అనుమతులు మంజూరు కావడంతో అవిభక్త కొరాపుట్ జిల్లాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

13 మందికి పోలీసు పతకాలు

- 11మందికి గ్యాలెంట్రీ, ఇద్దరికి రాష్ట్రపతి పతకాలు



ధీరేంద్ర శంభాజీ కుట్టే, సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి



హిమాన్షు భూషన్ స్వాయిన్, ఏసీపీ

భువనేశ్వర్: గణతంత్ర దినోత్సవం -2023 పురస్కరించుకుని విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన ఇద్దరు ఒడిశా పోలీసు సిబ్బంది ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి పోలీస్ మెడల్(పీపీఎం)కు ఎంపికయ్యారు. వీరిలో ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక కార్యదర్శి, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(ఏడీజీ) ధీరేంద్ర శంభాజీ కుట్టే, కటక్ విజిలెన్స్ డైరెక్టరేట్ కానిస్టేబుల్ ప్రహ్లాద్ రౌత్ ఉన్నారు. జాతీయ స్థాయిలో భారత రాష్ట్రపతి పోలీస్ పతకం పొందుతున్న 901మంది పోలీసు సిబ్బందిలో రాష్ట్రం నుంచి వీరివురూ స్థానం దక్కించుకోవడం విశేషం. అలాగే రాష్ట్రం నుంచి 11మంది పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ(పీఎంజీ) పతకానికి ఎంపికయ్యారు. వీరిలో భువనేశ్వర్ ఏసీపీ హిమాన్షు భూషణ్ స్వాయి, భద్రక్ జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్లు జతీంద్ర కుమార్ పండా, ప్రద్యుమ్న మిశ్రా ఉన్నారు. వీరితో పాటు సుందర్‌గఢ్ విజిలెన్స్ డీఎస్పీ సుధాంశు శేఖర్ పూజారి, భువనేశ్వర్ బీఎస్‌పీఏ డిప్యూటీ కమాండెంట్ జ్ఞానేంద్రకుమార్ దాస్, భువనేశ్వర్ సెక్యూరిటీ వింగ్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ భాటియార్‌సింగ్, బరంపూర్ విజిలెన్స్ డివిజన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జుగల్ కిశోర్ ప్రధాన్, కటక్ పట్నా కానిస్టేబుల్ సర్వోద్దిన్ ఖాన్, భువనేశ్వర్ ఎస్‌సీఆర్‌బీ ఏఎస్ఐ(కంప్యూటర్) భూషణ్ మహంతి, భువనేశ్వర్ డ్రిల్ ఇన్‌స్పెక్టర్ అనీల్‌కుమార్ మింజ్, రౌర్కెలా 4వ బెటాలియన్ సిపాయి ప్రదీప్‌కుమార్ బెహరా ఉన్నారు.

క్రికెట్ విజేత సంబల్‌పూర్



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

- రూ.లక్ష నగదు, ట్రోఫీ అందించిన నిర్వాహకులు

జయపురం: పట్టణంలోని సన్నీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో సంబల్‌పూర్ ఎంఎస్ఎస్ జట్టు విజేతగా నిలిచింది. ప్రముఖ క్రీడాకారులు గోపాల పట్నాయక్, శరత్‌చంద్ర త్రిపాఠీ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ టోర్నీలో బుధవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. హైదరాబాద్ కోనసీమ కింగ్స్, సంబల్‌పూర్ జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచిన సంబల్‌పూర్ జట్టు బ్యాంటింగ్ దిగి, 18.3 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌట్ అయ్యింది. సయ్యద్ జాకీ 29 బంతుల్లో 58 పరుగులు చేయగా, హైదరాబాద్ జట్టు బౌలర్ సురేష్‌కుమార్ 28 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అలాగే వాసు 17 పరుగులిచ్చి 3 వికెట్లు సాధించాడు. అనంతరం 142 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు 16.2 ఓవర్లలో 101 పరుగులు మాత్రం చేసి, ఆలౌట్ అయ్యింది. ఆ జట్టులో ధీరోజ్ లక్ష్మన్ 23 బంతుల్లో 24 పరుగులు చేయగలిగారు. సంబల్‌పూర్ బౌలర్ సంజయ్ 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టారు. దీంతో సంబల్‌పూర్ జట్టు 40 పరుగుల తేడాతో సన్నీ క్రికెట్‌కప్-2023ను కై వసం చేసుకుంది. విజేత జట్టుకు రూ.లక్ష నగదు, ట్రోఫీ, రన్నరప్‌కు రూ.60వేల నగదును జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అందజేశారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ ప్రధానశాఖ మేనేజర్ కె.బాలాజీ, క్రికెట్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నృసింహప్రసాద్ పట్నాయక్, సీనియర్ ఆటగాడు జితేంద్ర పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిరుత కళేబరం కలకలం



బరిహర్‌గొడి గ్రామస్తులు గుర్తించిన చిరుతపులి కళేబరం

భువనేశ్వర్: ఢెంకనాల్ జిల్లా హిందోల్ అటవీ ప్రాంతంలో చిరుతపులి కళేబరాన్ని గ్రామస్తులు బుధవారం గుర్తించారు. హిందోల్ అటవీ రేంజ్ ఖజురియాకటా సెక్షన్ బరిహర్‌గొడి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఇది తారస పడటతంతో సర్వత్రా భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సిబ్బంది ఈ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు. పరీక్షల కోసం కళేబరాన్ని భువనేశ్వర్‌కు తరలించారు. చిరుత మరణం పట్ల సందిగ్ధత నెలకొంది. వాస్తవానికి ఈ ప్రాంతంలో పులుల సంచారం దాఖలాలు లేవు. పరిసర అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చి ఉంటుందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎంగా మనోజ్‌శర్మ



మనోజ్‌శర్మ

భువనేశ్వర్: ఈస్ట్‌కోస్ట్ రైల్వేకు నూతన జనరల్ మేనేజర్‌గా మనోజ్ శర్మ నియమితులయ్యారు. ఆయన 1985 బ్యాచ్ ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీరింగ్(ఐఆర్ఎస్ఈ) అధికారి. 1987లో భారతీయ రైల్వేలో చేరారు. ఆయన గతంలో సెంట్రల్ రైల్వే ముంబై నిర్మాణ విభాగం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా, పశ్చిమ రైల్వే రత్లాం డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం), ఉత్తర రైల్వే ఢిల్లీలో చీఫ్ ఇంజినీర్‌గా, ఢిల్లీ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) చీఫ్ జనరల్ మేనేజర్, రీసెర్చ్ డిజైన్‌లో జాయింట్ డైరెక్టర్/డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. లక్నో రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ సంస్థలో పలు హోదాల్లో కీలకమైన బాధ్యతలు నిర్వహించారు.

ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



జయపురం: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయం నుంచి విద్యార్థులు పట్టణంలో చైతన్య ర్యాలీ చేపట్టారు. జిల్లా అదనపు మేజిస్ట్రేటు సంగ్రాంశేఖర పండా, సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్, డెప్యూటీ కలెక్టర్ నట్వర గౌరోడో పాల్గొన్నారు.

జయపురం: మున్సిపాలిటీ పరిధిలో ఈఓ సిద్ధార్థ పట్నాయక్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. 'ఓటరుగా గర్విస్తున్నాం.. ఓటు వేయటానికి సిద్ధంగా ఉన్నా'మని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎ.ఈశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పర్లాకిమిడి: ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా అధికారులు

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు అవంతి విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడ స్పోర్ట్స్ కౌన్సిల్, బొబ్బిలి గోకుల్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి కుస్తీ పోటీల్లో అవంతి కళాశాలకు చెందిన ఎం.కృష్ణకాంత్ 65కిలోల విభాగంలో, ఎం.వాసుదేవరావు 77 కిలోల విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. యూనివర్సిటీ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులు ఈనెల 27,28,29 తేదీల్లో మహారాష్ట్రలోని కొల్హాపూర్ శివాజీ యూనివర్సిటీలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటనున్నారు. కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, పీడీలు వి.వెంకటకుమార్, ఎం.ఈశ్వరరావులు బుధవారం అభినందించారు.

బీఆర్‌ఎస్ గూటికి కొరాపుట్ నేతలు!

- జీజేపీకి రాజీనామా చేసిన మాజీ సీఎం గొమాంగొ
- ఇటీవల తెలంగాణ సీఎం కేసీఆర్‌తో భేటీ
- అదే బాటలో జయరాం పంగి, సీనియర్ నాయకులు
- దక్షిణ ఒడిశాలో వేడెక్కిన రాజకీయ వాతావరణం



ఈనెల 13న తెలంగాణ సీఎం కేసీఆర్‌తో గిరిధర్ గొమాంగొ, శిశిర్ గొమాంగొ భేటీ



కేసీఆర్‌తో మాజీ ఎంపీ జయరాం పంగి



గిరిధర్ గొమాంగొ

రాయగడ/జయపురం/కొరాపుట్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగొ బీజేపీకి గుడ్ బై చెప్పారు. ఈ మేరకు బుధవారం తన రాజీనామ పత్రాన్ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు పంపించారు. ఎటువంటి పదవులు ఆశించకుండా సేవ చేసేందుకు ఏడేళ్ల తాను బీజేపీలో చేరానని, అయితే అనుకున్న విధంగా ప్రజలకు సేవలందించలేక పోయానని తెలిపారు. అందుకే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకునిగా కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి 9సార్లు ఎంపీగా పోటీ చేసి, గెలుపొందిన ఆయన.. పలుమార్లు కేంద్రమంత్రిగా, కీలక వ్యక్తిగా ఓ వెలుగు వెలిగారు. పార్టీ అధిష్టానంతో ఉన్న మైత్రి కారణంగా 1999లో అనూహ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి సైతం వరించింది. 2014 అనంతరం రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి విజయావకాశాలు లేకపోవడంతో 2015లో బీజేపీలో చేరారు. అయితే అక్కడ కూడా తనకు సరైన ఆదరణ లేకపోవడంతో క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇదిలా ఉండగా పొరుగు రాష్ట్రం తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నేతృత్వంలో ఇటీవల భారత రాష్ట్రీయ సమితి(బీఆర్ఎస్) ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన కుమారుడు శిశిర్ గొమాంగొతో కలిసి కేసీఆర్‌ను ఈనెల 13న గౌరవ పూర్వకంగా భేటీ అయిన గిరిధర్.. తాజాగా బీజేపీకి రాజీనామ చేయడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో ఆయన బీఆర్ఎస్‌లో చేరుతారనే ఊహాగానాలకు మరింత ఊతమిచ్చినట్లయ్యింది. దీనిపై గొమాంగొ నుంచి రేపోమాపో అధికారిక ప్రకటన వెలువడుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

27న ముహూర్తం?

తెలంగాణ సీఎం, బీఆర్‌టస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఒడిశాలో చేయూత లభిస్తుందనే సూచనలు కనిపిస్తున్నాయి. ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గొమాంగొ, అతని కుమారుడు శిశిర్ గొమాంగొ, మాజీ ఎంపీ జయరాం పంగి ఇటీవల హైదరాబాద్‌లో కేసీఆర్‌ను వేర్వేరుగా కలిసి, సంప్రదింపులు జరిపారు. అప్పటి నుంచి ముగ్గురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకుడు గిరిధర్ బీజేపీకి రాజీనామ చేయగా, ఈనెల 27న భారతీయ రాష్ట్ర సమితిలో చేరుతారనే వదంతులు వినిపిస్తున్నారు. అలాగే మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోరాడుతున్న కొరాపుట్ మాజీ ఎంపీ, మాజీ మంత్రి జయరాం సైతం అదే బాట పట్టనున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ప్రస్తుతం అతను 'దండకారణ్య పర్వతమాల వికాస పరిషత్'ను ఏర్పాటు చేసి, ఇదే వేదికగా పోరాటాలు నిర్వహిస్తున్నారు. ముగ్గురు సీనియర్ నాయకులతో పాటు, మరికొందరు గిరిజన ప్రముఖుల చేరికతో అవిభక్త కొరాపుట్ జిల్లాలు, దక్షిణ ఒడిశాలో బీఆర్ఎస్‌కు గట్టి మద్దతు లభిస్తుందనే సంకేతాలు వెలువడుతున్నాయి.

హైదరాబాద్ వేదికగా..

కొరాపుట్ లోక్‌సభ మాజీ ఎంపీ జయరాం పంగి భారతీయ రాష్ట్ర సమితిలో చేరనున్నట్లు బుధవారం వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తెలంగాణ సీఎం నేతృత్వంలో ఈనెల 27న హైదరాబాద్ వేదికగా బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం కొరాపుట్ జిల్లాలలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి కేసీఆర్ తోనే సాధ్యమనే విశ్వాసం ఉందని పేర్కొన్నారు. 1977లో రాజకీయాల్లో ప్రవేశించిన పంగి.. జనతాదళ్ చీలిక అనంతరం బీజేడీ లోకి కొనసాగారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి శాసనసభ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేశారు. 2 దశాబ్దాలు జిల్లా బీజేడీ అధ్యక్షుడిగా సేవలందించారు. తన చిరకాల కోరికగా కొరాపుట్ ఎంపీగా ఒకసారి పోటీ చేసి, గెలుపొందారు. తన కుమారుడు రాజు పంగిని కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా గెలిపించుకున్నారు. అనంతరం బీజేపీలో చేరారు. ఆ పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో దండకారణ్య పర్వతమాల అనే సంస్థను స్థాపించారు. అయితే పంగి బీఆర్ఎస్‌లో చేరడం పట్ల ఎటువంటి ఫలితం ఉండదని రాష్ట్రానికి చెందిన బీజేపీ, బీజేడీ, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు.

సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌గురు మృతి



అంతిమ యాత్రలో పాల్గొన్న జర్నలిస్టులు, న్యాయవాదులు



చిరంజీవి రాజ్‌గురు(ఫైల్)

బరంపురం: నగరంలోని గజపతి నగర్ 5వ లైన్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్, న్యాయవాది చిరంజీవి రాజ్‌గురు గుండెపోటుకు గురై, బరంపురం ఎంకేసీజీ మెడికల్‌లో మంగళవారం చేరారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందారు. వివిధ ఒడియా దిన పత్రికల్లో పనిచేసిన ఆయన.. నిరంతరం ప్రజా సమస్యలపై కథనాలతో ఎనలేని పోరాటం చేశారు. దీంతో ప్రజల ఆదరణ, మన్ననలు పొందారు. రాజ్‌గురు మరణ వార్త విన్న నగరంలోని జర్నలిస్టులు, న్యాయవాదులు అంతిమ సంస్కారాల్లో పాల్గొని, నివాళులర్పించారు. వివిధ సంస్థల, సంఘాల ప్రతినిధులతో కలిసి భారీ సంతాప ర్యాలీ చేపట్టారు.



పర్లాకిమిడి: నివాళులర్పిస్తున్న పర్లాకిమిడి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

పర్లాకిమిడిలో సంతాపం

పర్లాకిమిడి: ఒడియా పత్రికా 'సోకాలో'జర్నలిస్ట్ రాజ్‌గురు(చింటు) అకాల మృతికి చింతిస్తూ స్థానిక టౌన్ హాలు వద్ద ఉన్న ప్రెస్‌క్లబ్‌లో సంతాప సభ నిర్వహించారు. పర్లాకిమిడి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు రూపేష్ సాహు, ఆదర్శదాస్, బసంత పండా, ప్రదీప్ నాయక్, బాలకృష్ణ పాత్రొ, వివేకానంద బెహరా, హరిహర పట్నాయక్, సీతానాథ పండా, జితేంద్ర బారిక్ తదితరులు పాల్గొని, నివాళులర్పించారు.

పీఎంఏవైపై విచారణ చేపట్టాలి



గుమ్మా సమితి బీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కృష్ణ బిశోయి



కాశీనగర్ బీడీఓకు వినతిపత్రం అందిస్తున్న దారపు రాజేష్‌కుమార్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం(పీఎంఏవై) మంజూరు, పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. 2018-19, 2019-20 విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాలో అర్హుల కంటే యోగ్యతలేని వారే ఎక్కువ మంది ఉన్నారని, దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గుసాని, గుమ్మా, కాశీనగర్ బీడీఓ లకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పేరిట రాసిన వినతిపత్రాలను బుధవారం అందజేశారు. రాష్ట్రప్రభుత్వం పీఎంఏవై పథకంలో 27లక్షల మందికి ఇళ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించగా, వాస్తవంగా లక్ష మందికి మాత్రమే మంజూరు చేసిందన్నారు. గత 2 ఆర్థికం సంవత్సరాల్లో మంజూరైన లబ్ధిదారుల్లో దాదాపు 3లక్షల మంది అర్హులు కానివారే ఉన్నారని బీజేపీ గుసాని మండలాధ్యక్షుడు గేదెల శ్రీధరనాయుడు, గుమ్మా బ్లాక్ అధ్యక్షుడు కృష్ణ బిశోయి, కాశీనగర్ అధ్యక్షుడు దారపు రాజేష్‌కుమార్ విమర్శించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకంలో పేదలకు లబ్ధి చేకూర్చాలని, లేకుంటే దీనిపై జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ఈ సందర్భంగా ప్రకటించారు.

సెంచూరియన్ వర్సిటీను సందర్శించిన కెనడా బృందం



ప్రయోగశాలను పరిశీలిస్తున్న కెనడా బృందం ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి గ్రామంలో ఉన్న సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని కెనడాకు చెందిన సీసీఐ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అలోయ్, ఎమిలి తదితరులు బుధవారం సందర్శించారు. బోధన పద్ధతులు, ప్రయోగశాల, విద్యా విధానాలను పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. నైపుణ్య విద్యకు సెంచూరియన్ అనుకూలంగా ఉందని కితాబిచ్చారు. అనంతరం ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యతను వర్సిటీ విద్యార్థులకు వీసీ జీఎస్ఎన్ రాజు వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, హెచ్ఓడీ ప్రొఫెసర్ విశ్వభూషణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కళావతికి అస్వస్థత



పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ/వీరఘట్టం: అవిశ్రాంతంగా ప్రజా సేవలో నిమగ్నమైన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వివిధ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆరోగ్యం నిలకడగానే ఉందని, నెలరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు, ఆర్ఎం జె.రవీంద్ర కుమార్ సూచిస్తూ డిశ్చార్జ్ చేశారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమగ్నమయ్యారు. రాత్రి పగలు తేడా లేకుండా కొండలపై ఉన్న గిరిజన గ్రామాలకు చేరుకుని ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, పథకాల లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. నియోజకవర్గంలో 33 సచివాలయాల పరిధిలోని 102 పంచాయతీల్లో 82 రోజుల పాటు ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ క్రమంలో ఈ నెల 21న దోనుబాయిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. నాలుగు రోజులుగా స్వగ్రామం వండవలో విశ్రాంతి తీసుకున్నా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేరి వైద్యసేవలు పొందారు. ఎమ్మెల్యే కళావతి ఆరోగ్యం కుదటపడి, త్వరగా కోలుకోవాలని నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షిస్తున్నారు.

జీడితోటలు దగ్ధం



దగ్ధమవుతున్న జీడితోటలు

కొత్తవలస రూరల్: మండలంలోని అర్ధాన్న పాలెం రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్-85 కొండపై జీడితోటలు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం కొండ పక్కన గల డంపింగ్ యార్డులో మొదలైన మంటలు కొండపై వరకు చేరుకుని జీడితోటలు అగ్నికి ఆహుతైనట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఈ ఘటనలో రూ.50,000 వరకు పంటనష్టం జరిగినట్లుగా అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



రైలు నుంచి జారిపడి మృతిచెందిన యువకుడు

బొండపల్లి: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బొబ్బిలి రైల్వే హెచ్‌సీ కృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాయగడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్యాసింజర్ రైలు నుంచి సుమారు 25 నుండి 30 ఏళ్ల వయస్సు గల యువకుడు గొట్లాం రైల్వే స్టేషన్ పరిధిలో జారి పడినట్లు రైలు గార్డు గుర్తించాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని గార్డు తన బోగిలో ఎక్కించుకుని చికిత్స కోసం విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని సర్వజన కేంద్ర ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుని శరీరంపై ముదురు నీలి రంగు టీషర్టు, జీన్ ఫ్యాంట్ ఉన్నాయి. మృతుడి దగ్గర ఎటువంటి ఆధారాలు లభించలేదని ఆచూకీ తెలిసిన వారు బొబ్బిలి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్సై రవివర్మ కోరారు.

వైభవంగా .. పోలమాంబ అనుపోత్సవం



వనంగుడికి బయల్దేరిన అమ్మవారి ఘటాలు



చిన్నారుల మీదుగా ఘటాలతో దాటుతున్న భక్తురాలు

- వనంగుడికి చేరిన అమ్మవారి ఘటాలు
- దారిపొడవునా అమ్మవారి ఘటాలకు పూజలు
- ఈనెల 31న మారుజాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల ఆరాధ్యదైవం శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 9.45 గంటలకు గ్రామ ప్రధాన రహదారిలో ఉన్న అమ్మవారి గద్దె వద్దకు చేరిన ఘటాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానాలయం సమీపంలో ఉన్న యాత్రాస్థలం వద్ద ట్రస్టు బోర్డుచైర్మన్ పూడి దాలినాయుడు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు గంజి కాశినాయుడు, వసంతుల భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, రెవిన్నాయుడు, పూడి, కరణం, కుప్పిలి, గిరిడ కుటుంబాల సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు ఘటాలకు పూజలు చేశారు. అమ్మవారి ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని నిర్వహించారు. అక్కడ నుంచి వనంగుడికి బయల్దేరిన అమ్మవారి ఘటాలకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. చిన్నారులపైనుంచి ఘటాలను దాటించారు. యాత్రాస్థలం నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న వనంగుడికి కాలినడకన అమ్మవారి ఘటాలను తీసుకెళ్లగా వందలాది మంది భక్తులు తరలివెళ్లారు. మేళాతాళాలు, తప్పెటగుళ్లు, మహిళల కోలాట ప్రదర్శన, పోతిరాజు వేషధారణలు భక్తులను అలరించాయి. వనంగుడి వద్దకు చేరుకున్న ఘటాలను ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. వనంగుడిలో అమ్మవారి ఘటాలను ఉంచిన తర్వాత పూజారి రామారావు గుడి చుట్టూ మూడుసార్లు తిరిగి కట్టువేశారు. ఈ నెల 31వ తేదీన పోలమాంబ అమ్మవారి మారుజాతర నిర్వహించనున్నారు.

అమ్మవారి సేవలో భక్తజనం

ప్రధానాలయంలో ఉన్న పోలమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచి బారులు తీరారు. గోముఖి నదిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారికి చీరలు, గాజులు, కోళ్లను చూపించి మొక్కుబడులు చెల్లించారు. ఈఓ వి.రాధాకృష్ణ భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ పి.దేవకుమార్ పర్యవేక్షణలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాలను అనుపోత్సవం రోజున కూడా కొనసాగించారు.



వేయ్.. దరువేయ్...



కోలాటమాడుతున్న కళాకారులు

న్యూస్‌రీల్

కొత్తూరులో నకిలీ నోట్ల కలకలం

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో నకిలీ రూ.500 నోట్లు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రధానంగా కిరణా షాపులు, వస్త్ర దుకాణాల్లో వీటి చలామణి ఎక్కువగా ఉంటోంది. భామిని, సీతంపేట, హిరమండలంతో పాటు ఒడిశాకు ఆనుకుని ఉన్న గ్రామాలకు కొత్తూరు మార్కెట్ కేంద్రంగా ఉండటం, ఈ ప్రాంతంలో గిరిజనులు రాకపోకలు ఎక్కువగా సాగిస్తుండటంతో అక్రమార్కులు ఇక్కడి మార్కెట్‌ను లక్ష్యంగా పెట్టుకుని నకిలీ నోట్ల దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఇటీవల కొత్తూరు-బత్తిలి రోడ్డులో ఓ వ్యాపారి డెలివరీ బాయ్‌కు రూ.500 నోటు ఇచ్చారు. ఆ నోటు కొత్తూరులోని ఆన్‌లైన్ హబ్ సూపర్‌వైజర్ గమనించి నకిలీదిగా గుర్తించడంతో తిరిగి వ్యాపారికే నోట్‌ను పంపించేసినట్లు తెలిసింది. పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి నకిలీ నోట్లకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

గర్భిణిని ఆదుకున్న 108 అంబులెన్స్



మగబిడ్డకు జన్మనిచ్చిన సవర మధు

మందస: గిరిజన ప్రాంతాల్లో 108 అంబులెన్స్ సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మందస మండలం బసవసాయి పంచాయతీ కారిబంద గ్రామానికి చెందిన సవర మధు అనే మహిళకు బుధవారం ఉదయాన్నే పురిటినొప్పులు రావడంతో 108 కాల్‌సెంటర్‌కు సమాచారం అందించారు. మందస 108 వాహనం సిబ్బంది ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, వాయలపల్లి మురళీమోహన్‌తో పాటు ఆశావర్కర్ సవర మేరీ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే పురిటినొప్పులు ఎక్కువ కావడంతో పలాస సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా గొప్పిలి సమీపంలో మధు మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

కష్టం బుగ్గిపాలు



కాలిపోయిన వరిచేను కుప్పలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొర్రంపేట సమీపంలో పంట పొలాల్లో సుమారు మూడు ఎకరాల వరి చేనుకుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు కుప్పలకు నిప్పంటించారని బాధిత రైతులు మామిడి నీలంనాయుడు, ఎండ త్రినాథులు వాపోయారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట బుగ్గిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి

- రహదారిపై బైఠాయించిన గిరిజనులు

హిరమండలం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన బాధిత కుటుంబాలకు న్యాయం చేసి ఆదుకోవాలని కొత్తూరు మండలం పెద్దరాజపురం గ్రామానికి చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై బుధవారం బైఠాయించారు. ఈ సందర్భంగా సవర చిన్నారావు, శైలేష్, నిమ్మక రామకృష్ణులతో పాటు పలువురు ఆదివాసీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి కొత్తూరు మండలం గొట్టిపల్లి పంచాయతీ పరిధి పాండ్రమనిగూడ, పెద్దరాజపురం గ్రామానికి చెందిన సవర కూర్మయ్య, శ్యాముల్, జోగారావులు ద్విచక్ర వాహనంపై హిరమండలం నుంచి కొత్తూరు వైపు వెళ్తుండగా కొండరాగోలు గ్రామం సమీపంలో ట్రాక్టర్లు ఢీకొట్టినట్టు చెప్పారు. ఈ ప్రమాదంలో సవర కూర్మయ్య అక్కడికక్కడే చనిపోగా మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు చెప్పారు. వీరిని నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సవర జోగారావు బుధవారం మృతి చెందినట్టు పేర్కొన్నారు. కూర్మయ్య, జోగారావు మృతదేహాలకు వారి కుటుంబ సభ్యులు లేకుండానే పోస్టుమార్టం జరిపించేందుకు తరలించడం పోలీసులకు తగదన్నారు. పోలీసుల తీరుకు నిరసనగానే పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. చనిపోయినవారు నిరుపేదలని.. వారి కుటుంబాలకు న్యాయం చేసి ఆదుకోవాలన్నారు. సంఘటన జరిగిన ప్రాంతంలో రెండు ట్రాక్టర్లు ఉన్నప్పటికీ ఒకదాన్ని మాత్రమే పోలీసులు అదుపులో తీసుకున్నారన్నారు. రాత్రి ఏడు గంటల వరకు నిరసన తెలిపినప్పటికీ ప్రమాదానికి బాధ్యులైన వారిని వెతుకుతున్నామని పోలీసులు చెబుతున్నారు తప్పితే ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ విషయాన్ని కొత్తూరు సీఐ వేణుగోపాలరావు వద్ద ప్రస్తావించగా.. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు అధికారులు గిరిజనులతో మాట్లాడి...న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. హిరమండలం, కొత్తూరు ఎస్సైలు జి.నారాయణస్వామి, గోవిందరావులు ఉన్నారు.



రిపబ్లిక్ డే వేడుకలకు సర్వం సిద్ధం

రిపబ్లిక్ డే వేడుకలకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదిక సిద్ధమైంది. గురువారం జరిగే గణతంత్ర ఉత్సవాలకు సంబంధించిన వేదిక, ప్రదర్శన స్టాళ్లు, సిటింగ్, మౌలిక వసతుల ఏర్పాట్లను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్, ఆర్డీఓ బి.శాంతి పరిశీలించారు. అంతకుముందు ఎస్పీ జి.రాధిక ఆధ్వర్యంలో డీఎస్పీ ప్రసాదరావు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, పాఠశాల విద్యార్థులు కవాతు సాధన చేశారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

బంగారు భారత్



రిపబ్లిక్ డే సందర్భంగా కాశీబుగ్గకు చెందిన కొత్తపల్లి చిన్నాచారి 0.100 మిల్లీ గ్రాముల బంగారంతో భారతదేశ చిత్రపటం తయారు చేశారు. గంటపాటు శ్రమించి ఎటువంటి అతుకులు లేకుండా అశోకచక్రం, జాతీయ జెండా స్పష్టం కనిపించేలా అద్భుతంగా రూపొందించారు. – కాశీబుగ్గ

ఢిల్లీ పరేడ్‌కు సిక్కోలు క్యాడెట్లు



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన 14– ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు దేశ రాజధాని ఢిల్లీలో గురువారం జరగనున్న గణతంత్ర పరేడ్‌లో పాల్గొననున్నారు. మూడు జిల్లాల ఆర్మీ వింగ్ తరఫున కళాశాలకు చెందిన చంద్రశేఖర్, సాయికుమార్, చైతన్య ఎంపిక కావడం పట్ల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ యాళ్ల పోలినాయుడు, అధ్యాపకులు, 14వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అమిత్ బెనర్జీ అభినందించారు. –శ్రీకాకుళం న్యూకాలనీ

అరటి గెలల నివేదన



మండలంలోని కిన్నెరవాడలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో 1008 అరటి గెలలను భక్తులు వేలాడదీశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అరటిగెలలను స్వామి వారికి నివేదించారు. –సారవకోట

కుక్కకు కర్మకాండ



స్థానిక హనుమాన్‌నగర్ కు చెందిన నెయ్యిల నారాయణరావు అమితంగా పెంచిన కుక్క(స్నూఫీ) మృతి చెందడంతో కర్మ కాండ నిర్వహించి అనుబంధం చాటుకున్నారు. సంక్రాంతి నాడు అనారోగ్యంతో స్నూఫీ మరణించడంతో 12వ రోజైన బుధవారం శుద్ధి కార్యక్రమాలతో పాటు బ్రాహ్మణుల సమక్షంలో కర్మ కాండ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. –నరసన్నపేట

స్కోచ్‌కు సమీపంలో పోలీస్ సేవ

సారా విక్రేతలు, తయారీదారులపై దాడులు చేయడం, నిల్వలు స్వాధీనం చేసుకోవడం, ధ్వంసం చేయడం మామూలే. కానీ ఎన్ని దాడులు చేస్తున్నా సారాను పూర్తిగా ఎందుకు అరికట్టలేకపోతున్నారు? ఈ ప్రశ్నే జిల్లా ఎస్పీ జీఆర్ రాధికను ఆలోచింపజేసింది. సారా ఆదాయం తప్ప వేరే ఆదాయం, ఉపాధి లేకపోవడం వల్లే.. దాడులు, అరెస్టులు చేస్తున్నా వారు మళ్లీ మళ్లీ అటువైపే వెళ్తున్నారని అర్థమైంది. అదే ఆపరేషన్ పరివర్తన్‌కు దారి చూపించింది. సారా కేసుల్లో అరెస్టు చేసిన 203 మందిలో 98 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చూపించి పరివర్తన తీసుకొచ్చారు. మరోవైపు పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, వారి ద్వారానే సైబర్ మోసాలు, దిశ యాప్ వంటి వాటిపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు క్యాంపస్ కాప్స్ కార్యక్రమం విశేష ఆదరణ పొందాయి. జిల్లా పోలీసుల ఈ రెండు సేవలు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డుకు అడుగు దూరంలోనే ఉండటం విశేషం.

- స్కోచ్ సమ్మిట్-2022 అవార్డుల నామినేషన్స్‌కు 'ఆపరేషన్ పరివర్తన్', క్యాంపస్ కాప్స్
సెమీఫైనల్స్‌కు చేరిన రెండు ప్రాజెక్టులు
- ఫలించిన జిల్లా పోలీసు విభాగం కృషి



స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట, సారా తయారీ సామగ్రితో సెబ్ పోలీసులు



సారాతయారీ పాత్రలను ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: ఆపరేషన్ పరివర్తన్.. నాటుసారా క్రయ విక్రయాలు జరిపేవారు వృత్తి మాని సన్మార్గంలో నడిచేలా మార్పు తీసుకురావడమే కాకుండా వారికి గౌరవప్రదమైన ఉపాధి కల్పనే లక్ష్యంగా పోలీసులు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం. ఎస్పీ జి.ఆర్.రాధిక నేతృత్వంలో జిల్లా పోలీసులు అమలు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రతిష్టాత్మక స్కోచ్ సమ్మిట్–2022 అవార్డుల నామినేషన్లలో సెమీఫైనల్ దశకు చేరుకుంది. అలాగే, 'క్యాంపస్ కాప్స్' కార్యక్రమం కూడా స్కోచ్ అవార్డుల నామినేషన్లలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లడం విశేషం.

నాటుసారా రహిత జిల్లాయే లక్ష్యంగా..

నాటుసారా రహిత శ్రీకాకుళం జిల్లాగా మార్చేందుకు ఎస్పీ జి.ఆర్.రాధిక ఆధ్వర్యంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారి (జేడీ) వి.ఎస్.నాగ మణికంఠ, అసిస్టెంట్ కమిషనర్ కె.పి.గోపాల్‌లు తమ సిబ్బందితో ఎనలేని కృషి చేశారు. జిల్లాలోని వివిధ సబ్ స్టేషన్లలో నాటుసారా నేర గ్రామాలను ఏ– కేటగిరి (05), బి–కేటగిరి (15), సి–కేటగిరి (130)లుగా విభజించి వాటిపై (150 గ్రామాలపై) దాడులు నిర్వహించి గ్రీన్‌జోన్ కేటగిరిలోకి మార్చారు. 239 కేసులు నమోదు చేసి 203 మందిని అరెస్టు చేశారు. 4408.61 లీటర్లు నాటుసారా, 282 కిలోలు నల్లబెల్లం సీజ్ చేసి 79,995 లీటర్లు బెల్లం ఊట ధ్వంసంచేశారు. 25 మంది బెల్లం వర్తకులను బ్యాక్వర్డ్, ఫార్వర్డ్ లింకేజీలో అరెస్టులు చేశారు. దీంతో నాటుసారా తయారీ జిల్లాలో గణనీయంగా తగ్గింది.

ఒడిశా పోలీసులతో కలిసి...

సరిహద్దు రాష్ట్రం ఒడిశాలో ముఖ్యంగా ఆంధ్రా ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతాల్లో ఇప్పటికీ సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నెల 11న జిల్లా సెబ్, పోలీసు అధికారులు ఒడిశా రాష్ట్ర పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో కలిసి దుర్గం, ఏక్మార, మారంగి గ్రామాల్లో దాడులు జరిపారు. 47 వేల లీటర్ల బెల్లం ఊట, 1200 లీటర్ల నాటుసారా, 496 ప్లాస్టిక్ డ్రమ్ములు, మట్టి, సిల్వర్ పాత్రలు ధ్వంసం చేశారు.

ఉపాధి కల్పిస్తే మార్పు వస్తుందనే..

- నాటుసారా వల్ల కలిగే నష్టాలపై 150 గ్రామాల్లో జిల్లా పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించారు.
- వ్యాపారాన్ని విడిచిపెడితే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తుందని భరోసా ఇస్తూ 98 మందిలో పరివర్తన తీసుకొచ్చారు.
- జాబ్‌మేళాలో పలాస (6), ఆమదాలవలస (3), ఎచ్చెర్ల స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి మగ్గం పనులు(3), శ్రీకాకుళం ఎస్సీ కార్పొరేషన్ (3), డీఆర్‌డీఏ ద్వారా రూ.11 లక్షల రుణాలను 34 మందికి అందజేశారు.
- మరో 58 మంది స్వయం ఉపాధి చేసుకుంటూ జీవిస్తున్నారు.
- ఇటీవల కాలంలో నాటుసారాతో పట్టుబడుతున్న వారిని గుర్తించి జిల్లా నైపుణ్య శిక్షణా సంస్థ ప్రభుత్వ ఆర్థిక సాయంతో జీవనవిధానాలు మార్చుకునేలా చర్యలు చేపడుతున్నారు.

ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నా..



జాబ్ మేళాలో పాల్గొన్నా. ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నా. గౌరవంగా బతుకుతున్నా. డిగ్రీ చదువుకున్నానని తెలిసి పోలీసులు వేరే ఉపాధి చూడమన్నారు. నాలాంటి వారికి జాబ్ మేళాలు భరోసా కల్పిస్తాయి.

– కోరాడ చిరంజీవి, కోరాడపేట, గార మండలం

సెబ్ సిబ్బంది సూచనతో..

సెబ్ సీఐ, సిబ్బంది నచ్చజెప్పడంతో సారా వృత్తి మానేశాను. డీఆర్‌డీఏ ద్వారా రూ.10 వేలు రుణం మంజూరైనట్లు వెలుగు వారు ఫోన్ చేసి చెప్పారు. ప్రస్తుతం కిరాణా షాపు నడుపుతున్నా.

– సవర దుర్యోధన, కొండలోగాం, మందస మండలం

విద్యార్థుల్లో అవేర్‌నెస్ 'క్యాంపస్ కాప్స్'



2022 జులై 9న ఎస్పీ రాధిక ఆధ్వర్యంలో పలు కళాశాలల్లో 18 ఏళ్లు దాటిన విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తూ గంటపాటు పోలీసులతో పాటు ప్రజలకు సేవలందించేలా కార్యక్రమం రూపొందించారు. ఎస్పీ రాధిక ఆధ్వర్యంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లాకు చెందిన న్యాయమూర్తులు పలు కళాశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీకాకుళం, టెక్కలి సబ్‌డివిజన్ల పరిధిలో 16 కళాశాలలకు చెందిన 291 మంది విద్యార్థులు శిక్షణ పొంది 130 మంది విద్యార్థులు 100 గంటలకంటే ఎక్కువ సమయం (విరామ సమయంలో ఒక గంటపాటు) ఇప్పటివరకు ప్రజలకు సేవలందించారు. పోలీసుల సహకారంతో తెల్లని క్యాప్‌లు ధరించి ట్రాఫిక్ విధుల్లో పాల్గొనేలా, సైబర్ మోసాలు పట్ల ప్రజల్లో అవగాహన కలిగేలా, దిశా యాప్‌పై మహిళల్లో చైతన్యం కలిగేలా వీరు సేవలందిస్తున్నారు.

రుణపడి ఉంటా..



డీఆర్‌డీఏ ద్వారా అందించిన రూ.50 వేలు రుణంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటరు నడుపుతూ కుటుంబ పోషణ సాగిస్తున్నా. సారా విడిచిపెట్టి మంచిగా బతికితే ఉపాధి కల్పిస్తామని పోలీసులు చెప్పి మార్పు తీసుకొచ్చారు. పోలీసులకు, ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– గణగళ్ల ధర్మారావు, బారువ, సోంపేట మండలం

రుణ పరిమితి పెంచాలి..



గతంలో సారా విక్రయించేవాడిని. సెబ్ పోలీసులు వద్దనడంతో మానేశాను. బీఈడీ చదువుకోవడంతో పలాస జాబ్ మేళాకు వెళ్లినా వయసు 40 ఉండటంతో వర్తించలేదు. డీఆర్‌డీఏ రుణం రూ.10వేలు ఈ మధ్యే ఇస్తారని తెలిసింది. రూ.50 వేలు ఇస్తే బాగుండేది. ప్రస్తుతం పాన్‌షాపుతో నెట్టుకొస్తున్నా.

– సాహుకారి గోవిందరావు, కల్లాడ గ్రామం, నందిగాం మండలం

మార్పు తీసుకొచ్చారు..

పోలీసులు మార్పు తీసుకొచ్చారు. నాటుసారా అమ్మకం విడిచిపెట్టా. 34 మందికి అందించిన డీఆర్‌డీఏ రుణం(రూ.11 లక్షల్లో) రూ. 50 వేలు నాకూ వర్తించింది. ప్రస్తుతం ఆటో నడుపుతున్నా.

– గునిశెట్టి శ్రీనివాస్, మామిడిజోల, మందస మండలం

రాష్ట్రస్థాయి పోటీలకు మందస విద్యార్థులు

మందస: కాకినాడలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న బేస్‌బాల్ పోటీలకు మందస విద్యార్థులు ఎంపికయ్యారు. మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు తెల్లి ప్రవీణ్, కె.మౌనిక, డి.నదియ, తొమ్మిదో తరగతి చదువుతున్న కె.దీక్షిత, శివానీపండా, బి.హర్షిత, జె.కావ్య, ఎస్.విశ్వామిత్ర అండర్ 14, 17 విభాగాల్లో పాల్గొననున్నారు. వీరిని బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.భాస్కరరావు, పీడీలు కార్తికేశ్వరరావుచౌదరి, రవికుమార్‌లు అభినందించారు. విజేతలై రావాలని ఆకాంక్షించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

డోనర్ పాసుల పంపిణీ ప్రారంభం

అరసవల్లి: రథసప్తమి సందర్భంగా ఆలయ దాతలకు ఇచ్చే డోనర్ పాసుల పంపిణీ బుధవారం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి దాతలు తమ రిసీట్స్‌తో వచ్చి పాసులు తీసుకెళ్లారు. ఈ నెల 27 సాయంత్రం పాసుల పంపిణీ జరిగేలా ఆలయంలో ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం వరకు విరాళాలు ఇచ్చిన వారికి కూడా దాతల పాసుల జాబితాలో చేర్చుకునేలా చర్యలు చేపట్టినట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, పాతపట్నం ఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. గురువారం రిపబ్లిక్ డే అయినప్పటికీ స్థానిక అరసవల్లి యూనియన్ బ్యాంకు సిబ్బంది విధుల్లో ఉంటారని, రూ.500 వీఐపీ టికెట్ల విక్రయాలు కొనసాగిస్తారని, ఆర్డీఓ అనుమతి పత్రంతో టికెట్లు పొందవచ్చునని ఈవో చెప్పారు.



సప్తమి దర్శనం ఇలా సులభతరం..



- శుక్రవారం అర్ధరాత్రి నుంచి దర్శనాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఈ నెల 28న జరగనున్న రథసప్తమి మహోత్సవానికి సూర్యదేవాలయ ప్రాంగణ, పరిసరాలు ముస్తాబవుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల (తెల్లవారితే శనివారం) నుంచి ఆలయంలో దర్శనాలు ప్రారంభించనున్నారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక రూట్ మ్యాప్‌ను బుధవారం విడుదల చేశారు. భక్తులకు వివిధ దర్శన మార్గాల వివరాలు స్పష్టంగా తెలియజేసేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో క్లాత్ బ్యానర్లు ఏర్పాటు చేస్తామని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

దాతల పాసులు:

ఆలయ అభివృద్ధికి, వివిధ రకాలుగా విరాళాలు ఇచ్చిన వారికిచ్చే డోనర్ (దాతల) పాసులున్న వారు ప్రధాన రోడ్డులో బొంపాడ వీధి కూడలి నుంచి ప్రత్యేక క్యూలైన్‌లో వస్తారు. ఉత్తర ద్వారం పక్క నున్న ప్రత్యేక క్యూలైన్‌లో ఆలయం లోపలికి వెళ్లనున్నారు. ఈ పాసుతో నలుగురికి అనుమతించనున్నారు. ఈ పాసులకు 27వ తేది అర్ధరాత్రి 12 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు.

ఉచిత దర్శనాలు:

అరసవల్లి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నుంచి సాధారణ (ఉచిత) దర్శనాల క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఆలయానికి ఏ వైపు నుంచి వచ్చిన భక్తులైనా ఉచిత దర్శనానికి రావాలంటే ఇదొక్కటే మార్గం. ఇంద్రపుష్కరిణికి ఆగ్నేయంగా ఉన్న మార్గం ద్వారా పుష్కరిణి చుట్టూ ఉన్న కంపార్ట్‌మెంట్ల నుంచి ఆలయంలోకి దర్శనాలకు వెళ్తారు.

రూ.100 ప్రత్యేక టికెట్ దర్శనాలు:

ఈ టికెట్‌తో దర్శనాలు కూడా అరసవల్లి హైస్కూల్ నుంచే క్యూలైన్లు ప్రారంభం కానున్నాయి. వీరు మాత్రం ఇంద్ర పుష్కరిణి ఈశాన్య గేటు, కేశఖండనశాల పక్క నుంచి ఆలయంలోకి చేరుకుంటారు. ఆలయానికి ఏ వైపు నుంచి వచ్చిన భక్తులైనా రూ.100 దర్శనానికి వెళ్లాలంటే ఇదొక్కటే మార్గం. ఉచిత దర్శన భక్తులు, రూ.100 దర్శన టికెట్లు తీసుకున్న భక్తులు వేర్వేరుగా క్యూలైన్లలో వచ్చినప్పటికీ ఆలయ ప్రధాన గోపురం ముందు ఉన్న ఒకే క్యూలైన్లో కలిసిపోయి ఒకే లైన్ ద్వారా ఆలయంలోనికి దర్శనానికి వెళ్లనున్నారు.

క్షీరాభిషేక సేవ (ఇద్దరికి అనుమతి):

అరసవల్లి ప్రధాన రోడ్డులో బొంపాడ వీధి కూడలి వద్ద నుంచి ప్రత్యేక క్యూలైన్ ద్వారా వెళ్లనున్నారు. క్యూలైన్‌లోనే ఈ టికెట్టును రూ.500తో కొనుగోలు చేసుకున్న భక్తులు(ఇద్దరికి అనుమతి) ఆలయ ప్రధాన ఆర్చిగేట్ మీదుగా ప్రత్యేక లైన్లో దర్శనానికి వెళ్లనున్నారు. ఈ సేవ సప్తమి రోజున అర్ధరాత్రి 12.15 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే ఉంటుంది.

రూ.500 విశిష్ట దర్శనం (ఇద్దరికి అనుమతి):

బొంపాడ వీధి నుంచి ప్రారంభమైన క్షీరాభిషేక సేవ మార్గంలోనే వీరు కూడా వెళ్తారు. క్షీరాభిషేక సేవ అనంతరం అంటే ఉదయం 6 తర్వాత నుంచి రాత్రి 8 గంటల వరకు ఇదే లైన్‌లో విశిష్ట దర్శనం పేరిట (రూ.500) టికెట్టుదారులు దర్శనానికి వెళ్లనున్నారు.

వి.ఐ.పి టికెట్లు (ఇద్దరికి అనుమతి):


ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన విఐపి టికెట్ (రూ.500)లను శ్రీకాకుళం ఆర్డీవో అనుమతితో అరసవల్లి యూనియన్ బ్యాంకులో కొనుగోలు చేసిన భక్తులు నేరుగా ఆలయ ప్రధాన ఆర్చిగేట్ నుంచి ప్రత్యేక క్యూలైన్లలో దర్శనాలకు వెళ్లనున్నారు. వీరు సుదర్శన మండపం వద్ద రూ.500 విశిష్ట దర్శనదారులతో కలిసిపోయి ఒకేలైన్లో స్వామి వారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.

వాహనాల పార్కింగ్:

అరసవల్లి మిల్లు కూడలి వైపు నుంచి వచ్చిన వాహనాలన్నీ 80 ఫీట్ రోడ్డు వద్ద వాహనాల పార్కింగ్‌కు, స్థానిక పెద్దతోట వద్ద చెప్పుల స్టాండ్లకు ఏర్పాట్లు చేశారు. కళింగపట్నం రోడ్డు నుంచి అరసవల్లి వచ్చే భక్తుల వాహనాలను అసిరితల్లి ఆలయం వద్ద పార్కింగ్, చెప్పుల స్టాండ్ కోసం సిద్ధం చేశారు. ఇక మిల్లు కూడలి, డీసీఎంఎస్ కార్యాలయం, ప్రధాన ఆర్చిగేటు, అసిరితల్లి అమ్మవారి ఆలయం కూడలి, నగర పాలక ఉన్నత పాఠశాలల వద్ద పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నారు.

వీవీఐపీ భక్తులు:

రాష్ట్రానికి చెందిన వీవీఐపీ స్థాయి గల ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు ఆలయ ప్రధాన ఆర్చిగేటు నుంచి నేరుగా అనివెట్టి మండపం నుంచి వెళ్లి మళ్లీ అదే మార్గంలో వెనుదిరిగేలా ఏర్పాట్లు చేశారు. వీరి వాహనాలు కూడా ప్రధాన ఆర్చిగేటు వరకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



దర్శనాల రూట్ మ్యాప్ ఇదే

ఎగ్జిట్ మార్గం:

ఇక సాధారణ భక్తులు, దాతలు, రూ.100, రూ.500 దర్శన టికెట్లు, రూ.500 వీఐపీ టికెట్లు భక్తులంతా స్వామి దర్శనానంతరం ఆలయ ఎగ్జిట్ ద్వారం నుంచే నేరుగా బ్రాహ్మణవీధి మీదుగా బొంపాడ వీధి కూడలి ప్రధాన రోడ్డుకు చేరుకునేలా ఈ మ్యాప్ సిద్ధం చేశారు.